క్లుప్తంగా

21మంది నిరుపేదలకు దుప్పట్లు, పళ్లు పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సంజీవినాయుడు

బలిజిపేట: మండలంలోని పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవినాయుడు 21మంది నిరుపేదలకు దుప్పట్లు, పళ్లు శుక్రవారం పంపిణీ చేశారు. ఆయన తండ్రి వర్ధంతి సందర్భంగా నిరుపేదలకు వాటిని పంపిణీ చేసినట్లు తెలిపారు. నిరుపేదలకు అన్నదానం, వస్త్రదానం చేయాలని ఆయన కోరారు. పేదలకు తిండి, వస్త్రం కరువవుతోందని వాటిని వారికి ఏదో రూపంలో అందించగలిగితే వారి బాధను తీర్చిన వారమవుతామన్నారు. కార్యక్రమంలో ఆయన కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బలిజిపేట: బలిజిపేట టౌన్, రూరల్, నారాయణపురం ఫీడర్లలో ఆర్‌డీఎస్ఎస్ పనులు నిర్వహించనున్నందున దాని పరిధిలో ఉండే గ్రామాలకు శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సింహాచలం తెలిపారు. బలిజిపేట టౌన్, వెంగాపురం, తుమరాడ, పలగర, మిర్తివలస, చెల్లింపేట, బర్లి, సుభద్ర, బడేవలస, శివరాంపురం, పణుకువలస, అరసాడ, పదమాయవలస, పి.చాకరాపల్లి, నారాయణపురం, రావివలస, గౌరీపురం, పెద్దింపేట, పోలినాయుడువలస, గీతనాపల్లి గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

232మందికి ఉచిత నేత్ర వైద్యపరీక్షలు



బలిజిపేట జూనియర్ కళాశాలలో వైద్యపరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ రమేష్

బలిజిపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ ప్రైమరీ పాఠశాలలో 232మందికి శుక్రవారం ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. బలిజిపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 232మందికి వైద్య పరీక్షలు చేయగా నలుగురికి కంటి అద్దాలు అవసరమని గుర్తించినట్లు ఆప్తాలమిక్ రమేష్ తెలిపారు. బలిజిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 180మందికి, మోడల్ ప్రైమరీ పాఠశాలలో 52మందికి ఉచిత నేత్ర వైద్యపరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు ఎక్కువగా సెల్‌ఫోన్లు వినియోగించడం వల్ల కంటి ఇబ్బందులు ఎదురవుతాయని వాటి వినియోగం తక్కువ చేయాలని ఆప్తాలమిక్ రమేష్ సూచించారు. కార్యక్రమంలో బలిజిపేట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఉమామహేశ్వరరావు, వేదప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

పంట నష్టాలపై రైతుల ఆందోళన



ఇటీవల వీచిన గాలులకు నేలకొరిగిన అరటి తోట

సాలూరు రూరల్: ఇటీవల వీచిన ఈదురు గాలులకు మండలంలోని అరటి, మొక్కజొన్న, పామాయిల్ పంటలు నష్టపోయిన రైతులు ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. చేతికి పంట వచ్చే సమయానికి ప్రకృతి కోపానికి బలైన రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఏమేరకు ఆదుకుంటుందోనని ఆందోళన చెందుతున్నారు. అరటి తోటల రైతులు కనీసం 10 శాతం పంటకూడా చేతికి అందలేదని మొత్త పంట గాలి పాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలల్లో మదుపులు అప్పులు చేసి పెట్టామని వాటికి వడ్డీలు కట్టలేకపోతున్నామని రైతులు తమ గోడును వెళ్లగక్కుతున్నారు.

దళితులు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలి



దళితుల భూములను సర్వే చేయిస్తున్న సీపీఎం నాయకులు, రైతులు

సాలూరు రూరల్: మండలంలోని నెలిపర్తి గ్రామ రెవెన్యూ పరిధిలో దళితులు సాగుచేస్తున్న భూములకు పట్టాలివ్వాలని సీపీఎం నాయకుడు మర్రి శ్రీను డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ నెలిపర్తిలో 30 మంది దళిత రైతులు వారసత్వంగా వచ్చిన భూములను సాగుచేస్తుకుంటున్నారని, గురువారం సర్వేయరు వచ్చి సర్వేచేసినట్లు తెలిపారు. ఈ సర్వే రిపోర్టును ఉన్నతాధికారులకు పంపించి వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సారా మహమ్మారి.. అనారోగ్యానికి దారి



ఏఓబీ గ్రామాల్లో సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది(ఫైల్)

- గిరిశిఖర, ఏఓబీ గ్రామాల్లో యథేచ్ఛగా తయారీ
- ఛిద్రమవుతున్న బతుకులు
- జిల్లా కేంద్రంలో సారాకు కరువు లేదు

పార్వతీపురం టౌన్:

ఓ వైపు ప్రభుత్వ వైఫల్యం, మరోవైపు ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజారోగ్యానికి తూట్లు పడుతున్నాయి. గత ఏడాదిన్నర కాలంగా పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా విషజ్వరాలు, పారిశుద్ధ్య లోపం, తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న మన్యం వాసులకు సారా కష్టాలు మరిన్ని ఇబ్బందులు తెచ్చి పెడుతున్నాయి. మన్యం జిల్లా వ్యాప్తంగా, ఏఓబీ గ్రామాల్లో, గిరిజన సీమల్లో, గిరిశిఖర గ్రామాల్లో సారా ఏరులై పారుతోంది. సారా అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. అనేక గ్రామాల్లో, పట్టణాల్లో బహిరంగంగానే క్రయ విక్రయాలు జరుగుతున్నాయి. జిల్లాలో ఏఓబీ గ్రామాల్లో సారా తయారీ కేంద్రాలు కుటీర పరిశ్రమలుగా ఏర్పడ్డాయి. విస్తారంగా వర్షాలు కురుస్తుండడం, గెడ్డలు, వాగులు, నిండుగా ప్రవహిస్తుండడంతో అయా ప్రాంతాలను వ్యాపారులు తమకు అనువుగా మార్చుకుని బెల్లపు ఊటలను తయారు చేస్తున్నారు. రాత్రి సమయాల్లో అక్రమంగా సారాను తయారు చేస్తూ జిల్లా కేంద్రంగా అనేక జిల్లాలకు దాటిస్తున్నారు. నెలలో ఏదో ఒకరోజు ఎక్సైజ్ అధికారులు మేమున్నామంటూ తూతూ మంత్రంగానే దాడులు నిర్వహిస్తూ మమ అని చేతులు దులుపుకుంటున్నారు. పూర్తిస్థాయిలో నిఘా లేకపోవడంతో మన్యం జిల్లా సారా క్రయ విక్రయాలకు, అక్రమ రవాణాకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది.

అవగాహన కల్పిస్తున్నాం.



జిల్లా వ్యాప్తంగా సారా ప్రభావిత గ్రామాలను గుర్తించాం. ఆగ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టాం. గ్రామాల్లో గిరిజనులకు అవగాహన కల్పించేందుకు నవోదయం 2.0 కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించి గిరిజనులను చైతన్యవంతులం చేస్తున్నాం. సారా రవాణా, తయారీ, అమ్మకాలపై నిఘా పెట్టి ఎప్పటికప్పుడు కేసులు నమోదు చేస్తున్నాం.

– ఎ.సంతోష్, ఎక్సైజ్ ఏఈఎస్, పార్వతీపురం మన్యం

ఎలా అంటే..

సారా వ్యాపారంలో పెట్టుబడి తక్కువ. లాభాలు ఎక్కువ ..కష్టం కూడా తక్కువగానే ఉండడంతో ఈ వ్యాపారాన్ని అనేక మంది వృత్తిగా మలుచుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా పార్వతీపురం, సీతంపేట, ఏజెన్సీ ప్రాంతాల్లో సారా వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలు అన్నచందంగా మారింది. జిల్లా కేంద్రంలోనే యథేచ్ఛగా సారా విక్రయాలు జరుగుతున్నాయంటే ఇక మారుమూల గిరిజన గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ఊహాతీతం. జిల్లాలోని ఏఓబీ గ్రామాలు, మారుమూల గిరిజన గూడలు, తదితర గ్రామాల పరిసరాల్లో సారా తయారీ కేంద్రాలు ఎక్కువగా ఉన్నాయి. ఇటీవల ఈ గిరిజన గ్రామాల పరిసరాల్లోనే ఎక్సైజ్‌శాఖ కేసులు నమోదు చేస్తున్నప్పటికీ ఈ ప్రాంతాల్లో మరీ సారా ఎక్కువగా తయారు చేస్తూ అక్రమ వ్యాపారులు ఎక్సైజ్ అధికారులకు సవాల్ విసురుతున్నారు.

బతుకులను ఛిద్రం చేసుకుంటున్నారు

గిరిజన గ్రామాల్లో ఆదివాసీలకు సారాకు మధ్య విడదీయరాని బంధం ఏర్పడింది. శుభకార్యాలు, పండగల సమయాల్లో ఎక్కువగా మద్యాన్ని తాగుతారు. గిరిజన ప్రాంతాల్లో నిత్యం లభించే సారాను కొందరు అవసరానికి మించి వినియోగిస్తున్నారు. మద్యం దుకాణాల్లో ఎక్కువ నగదు చెల్లించి కొనుగోలు చేయలేని మందుబాబులు తక్కువ ధరకే లభించే సారాకు అలవాటు పడుతున్నారు. దీనికి బానిసలై బతుకులను ఛిద్రం చేసుకుంటున్నారు. సారా తాగడం వల్ల కలిగే అనర్థాలపై గ్రామస్థాయిలో పెద్దగా అవగాహన సదస్సులు నిర్వహించడంలేదు. దీంతో గిరిజనుల్లో చైతన్యం కొరవడింది.

ముడిసరుకుల విక్రయాలకు అడ్డే లేదు...

సారా తయారీకి వినియోగించే ముడిసరుకులు బెల్లం, పటిక, అమోనియా, నవాసారం వంటి వాటిని ఎక్కువగా మైదాన ప్రాంతాల్లో యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. కొంతమంది వ్యాపారులు తమ గొడౌన్లలో నల్ల బెల్లాన్ని నిల్వ చేస్తున్నారు. రాత్రివేళ క్వింటాళ్ల లెక్కన వాటిని వ్యాన్లలో లోడ్ చేసి సారా ప్రభావిత గ్రామాల్లోని వ్యాపారులకు సరఫరా చేస్తున్నారు.

జరిగేదంతా రాత్రివేళలోనే ..

గిరిజన ప్రాంతాల్లో తయారు చేసిన సారాను కొంతమంది వ్యాపారులు రాత్రివేళ ఆటోలు, బైక్‌ల ద్వారా మైదానంలోని పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారు. మన్యంలో సరిహద్దు గ్రామాలైన జయకోట, బొత్తరాపల్లి, మూలకర్ని, విక్రాంపురం, అలమండ, సోరుపల్లి, సందుబడి. రేగులపాడు, సంబలబాయి, ఎగువ పిల్లిడ్డి, జీడివలస, అత్తిగడ, జగ్గూడ, టికరపాడు, కప్పలాడ, మానిక్యవలస, ఎడుగుమ్మలవలస, పోల్ల, చిన్నబగ్గ, కడగండి, ఓండ్రుజోల, వలగజ్జి గ్రామాల మీదుగా జనసంచారం లేని మార్గాలగుండా సారా తరలిస్తున్నారు. పార్వతీపురం, కురుపాం, పాలకొండ, సాలూరు నియోజకవర్గాల్లో పలు ప్రాంతాలకు ఇక్కడి నుంచి ప్లాస్టిక్ కేన్లలో సారా రవాణా చేస్తున్నారు. దీనిపై ఎక్సైజ్ శాఖ నిఘా కొరవడింది. దీంతో రోజుకు కొన్ని వేల లీటర్ల సారా రవాణా అవుతోంది.

మహిళలపై వేధింపులు ఆపాలి



పలగర గుడివాడ కాలనీలో ఐద్వా జెండాను ఆవిష్కరించిన మహిళలు

బలిజిపేట: డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు మంజూరుచేయాలని, వారిపై వేధింపులు ఆపాలని మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని పలగర గుడివాడ కాలనీలో ఐద్వా జెండాను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా మండల అధ్యక్షురాలు సుధ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు సరైన న్యాయం చేయడం లేదన్నారు. బ్యాంకులో అధిక వడ్డీలు వసూలు చేయడం ఇబ్బందికరంగా ఉందని, మహిళలకు వడ్డీలేని రుణాలు మంజూరుచేయాలని డిమాండ్ చేశారు. మైక్రో ఫైనాన్స్ సంస్థల నుంచి మహిళలు అధిక వడ్డీలకు రుణాలు చేసి అప్పులు తీర్చలేక అవస్థలు పడుతున్నారన్నారు. అదేవిధంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, వేధింపులు భరించలేకపోతున్నామని వాటినుంచి రక్షించాలని డిమాండ్ చేశారు. మద్యం బెల్ట్‌షాపుల ద్వారా విక్రయాలను ప్రభుత్వం అరికట్టాలని కోరారు. మహిళలను మహిళలే రక్షించుకోవాలంటే పెద్ద ఎత్తున పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయ పడ్డారు. కార్యక్రమంలో యు.లక్ష్మి, కమిటీ సభ్యులు జయమ్మ, గౌరమ్మ, పాపమ్మ, కళావతి, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బోధనేతర పనుల బహిష్కరణ



ఎంఈఓ-2శ్రీనివాసరావుకు వినతి పత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

బలిజిపేట: రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు బోధనేతర పనులను బహిష్కరించనున్నట్లు ఫ్యాప్టో శాఖ పక్షాన ఎంఈఓ-2శ్రీనివాసరావుకు ఉపాధ్యాయులు శుక్రవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను విడుదల చేసి ఉద్యోగుల కుటుంబాలకు స్వాంతన చేకూర్చాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు చెల్లించని పక్షంలో సత్యాగ్రహ పద్ధతిలో విధులు నిర్వహించే ప్రక్రియ చేపడతామన్నారు. అన్ని బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఫ్యాప్టో పిలుపుమేర శనివారం నుంచి అమలు చేయనున్నట్లు తెలిపారు. పిల్లల హాజరు, మధ్యాహ్నభోజన పథకం నిర్వహణ తప్ప మరే ఇతర బోధనేతర పనులు నిర్వహించబోమని చెప్పారు. కార్యక్రమంలో ఎం.శేషగిరి, ఆర్.పకీరు నాయుడు, శంకరరావు, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల పెంపకంలో తల్లితండ్రుల పాత్ర కీలకం



చెల్లింపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

బలిజిపేట: పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పాత్రే కీలకమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని చెల్లింపేటలో ఐసీడీఎస్, విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్ట్ సపోర్ట్ సమన్వయంతో పోషణ మహా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, తల్లులు, మహిళలు, ఇతరులకు పోషకాహారం ప్రాధాన్యాన్ని వివరించారు. సమతుల ఆహారం అంటే ఏమిటో తెలియజేశారు. ఫోర్టిఫైడ్ రైస్, నూనెలు, చక్కెర, ఉప్పు వినియోగంపై అవగాహన కల్పించారు. ర్యాలీ నిర్వహించి హ్యాండ్‌వాష్ ప్రక్రియల గురించి ప్రత్యక్షంగా చేసి చూపించారు. గర్భిణులు, చిన్నారులకు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తే వారికి అంతమేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పి.జగన్‌మోహన్, ఎ.కృష్ణారావు, సిబ్బంది, అంగన్వాడీలు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ డిమాండ్



తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్‌ఏలు

పార్వతీపురం రూరల్: గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏల) సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు బీవీ రమణ, కోశాధికారి జి.వెంటరమణలు మాట్లాడుతూ ప్రభుత్వం వీఆర్‌ఏల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, వారికి కనీస వేతనాలు, అర్హులకు ప్రమోషన్లు, నామినీల రెగ్యులరైజేషన్, మహిళలకు ప్రసూతి సెలవులు వంటి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు టి. గోవింద, కె.లత, కృష్ణారావు, విద్యాసాగర్, కె. నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ప్రాయుడు సత్యం మాస్టారు




కళావేదికను ప్రారంబిస్తున్న సత్యం మాస్టారు, ఎంఈఓ-2 ఎంవీ రమణ

సీతానగరం: సొంత లాభం కొంత మానుకుని..ఆ విశ్రాంత ఉపాధ్యాయుడు ఆదర్శ ప్రాయుడిగా నిలుస్తున్నారు. తనకు జన్మనిచ్చిన గ్రామానికి సేవ చేస్తున్నారు. సీతానగరం మండలంలోని జగ్గునాయుడుపేట గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పెంట సత్యం గ్రామంలోనే విద్యాభ్యాసంచేసి ఉపాధ్యాయ వృత్తి కూడా స్వగ్రామంలోనే చేపట్టి ఉద్యోగ విరమణ చేశారు. సత్యం మాస్టారు ఉద్యోగం చేయడమే కాకుండా విద్యాభివృద్ధికి ఎంతో శ్రమిస్తూ పలువురికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. సత్యం మాస్టారు కుమారుడు మోహనరావు మాస్టారు దంపతులు, కుమార్తెల సహకారంతో గ్రామంలోని ఉన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో విద్యార్థులకు విద్యాబోధన చేయడానికి, ప్రార్థనగీతాలు ఆలపించడానికి, సమావేశాలు నిర్వహించడానికి నిర్మించిన కళావేదికను ఇటీవల ఎంఈఓ-2 ఎంవీ రమణ ఆధ్వర్యంలో సత్యం మాస్టారు ప్రారంబించారు. సొంత ఊరిలో విద్యాభివృద్ధికి సేవ చేయడం ఆనందంగా ఉందని సత్యం మాస్టారు ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రెడ్డి రవికుమార్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులు మానసిక దృఢత్వం కలిగిఉండాలి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా మెంటల్‌హెల్త్ కౌన్సిలర్ శారద

మక్కువ: విద్యార్థులు మానసిక దృఢత్వం కలిగి ఉండాలని జిల్లా మెంటల్‌హెల్త్ కౌన్సిలర్ కరణం శారద అన్నారు. ఈ మేరకు స్థానిక జిల్లాపరిషత్ పాఠశాలలో శుక్రవారం ప్రపంచ మెంటల్‌హెల్త్ దినోత్సవం సందర్భంగా మెంటల్ హెల్త్ కౌన్సిలర్ శారద హెచ్‌ఎం రోజారాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆందోళన, దుఃఖం, ఒత్తిడికి లోనైనప్పుడు మానిసికంగా ధైర్యం కోల్పోకుండా ఉండాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవితం సాగించాలంటే చదువుతోపాటు, ఆటలు, విశ్రాంతి అవసరమని తెలిపారు. పిల్లల భావోద్వేగాలను తల్లిదండ్రులు అర్థంచేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో దాహం కేకలు

- తాగునీటి ఎద్దడిపై కలెక్టరేట్‌లో ఐద్వా వినతి



డీఆర్‌ఓ హేమలత ద్వారా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఐద్వా సంఘం నాయకులు, స్థానిక మహిళలు

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రం పార్వతీపురం పట్టణంలో ప్రజలు గుక్కెడు మంచినీటి కోసం అల్లాడుతున్నారు. గడిచిన రెండు వారాలుగా కొళాయిల నుంచి మంచినీటి సరఫరా లేక ఉన్న బావులు, బోర్ల ద్వారా కలుషిత నీరు వస్తుండడంతో దాహం కేకలు తప్పడం లేదు. ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఆనీటినే తాగుతూ రోగాల బారిన పట్టణ ప్రజలు పడుతున్నారని స్థానికులతో కలిసి ఐద్వా సంఘం నాయకులు కలెక్టరేట్ వద్ద శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో తాగునీటి సరఫరా వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. పాత పైపులైన్ల స్థానంలో కొత్తవి వేయకపోవడంతో బురదనీరు సరఫరా అవుతోంది. ఈ సమస్యపై పురపాలక అధికారులు, పాలకవర్గం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ అఖిల భారత మహిళా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మహిళలతో కలిసి కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ కె.హేమలత ద్వారా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణ జనాభా రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా స్వచ్ఛమైన తాగునీటిని అందించడంలో యంత్రాంగం విఫలమైందని మండిపడ్డారు. ఈ మేరకు కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరించాలని లేకుంటే ప్రజలను సమీకరించి ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, నాయకురాళ్లు బొత్స లక్ష్మి, ప్రవల్లిక, కవిత, శాంతిలతో పాటు సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.ఉమామహేశ్వరి, బంకురు సూరిబాబు, జన విజ్ఞాన వేదిక నాయకుడు పాలక రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

సాలూరు: స్థానిక నియోజకవర్గంలోని సాలూరు పట్టణం, మండలం, పాచిపెంట, మక్కువ, మెంటాడ మండలాల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో పట్టణంలోని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర స్వగృహం వద్ద వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు సాలూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర అధ్యక్షతన శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఈ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీపట్టణ, మండలాధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్‌ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్, వార్డు మెంబర్లు తదితర వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

మద్యం షాపుల ఆకస్మిక తనిఖీ



షాపులో పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

సీతానగరం: మండలకేంద్రంలోని మద్యం దుకాణాలను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీతానగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పద్మావతి ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం అకస్మిక తనిఖీ చేశారు. ఈ మేరకు సీఐ పద్మావతి మాట్లాడుతూ విజయనగరం ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్, పార్వతీపురం డీపీఈఓ ఆదేశాల మేరకు ఎస్సై కె.మురళి సిబ్బందితో కలిసి మద్యం షాపులను తనిఖీ చేశామన్నారు. ఈ సందర్భంగా మద్యం విక్రయాలపై ఉన్న నిబంధనలు, నియమాలకు లోబడి, ఎమ్మార్పీకి విక్రయించాలని యాజమాన్యాలకు సూచించినట్లు తెలిపారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించినా, అక్రమంగా సారావిక్రయాలు నిర్వహిస్తున్నట్లు తెలిసినా పొరుగు రాష్ట్రానికి సంబంధించిన మద్యం విక్రయాలు చేసినా టోల్ ఫ్రీ నంబర్ 14405కులేదా 9440902373 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

వార్డు ప్రజల బైఠాయింపు

- తక్కువ కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై నిరసన



రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న ప్రజలు

సాలూరు: పట్టణంలోని 7వ వార్డు పరిధి రాజేశ్వరరావు పార్కు సమీపంలో ఉన్న 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి దాని స్థానంలో తక్కువ ఓల్టేజీ గల 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటుచేసే ప్రయత్నంచేయడంపై స్థానిక ప్రజలు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి వాహనంలో తరలిస్తుండగా ప్రజలు అడ్డుకున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, పట్టణ పౌరసంక్షేమ సంఘం కార్యదర్శి ఎస్ వైనాయుడు తదితరుల ఆధ్వర్యంలో ప్రజలు స్థానిక రహదారిపై బైఠాయించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తక్కువ ఓల్టేజ్ గల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేయడం వల్ల కార్మిక వార్డుల్లో ప్రజలు ఇబ్బందులు పడతారని, పాత ట్రాన్స్‌ఫార్మర్‌నే ఉంచాలని డిమాండ్ చేశారు. ఆందోళన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి పట్టణ సీఐ అప్పలనాయుడు, ఎలక్ట్రికల్ ఏఈ వచ్చారు. పాత కెపాసిటీ గల ట్రాన్స్‌ఫార్మర్‌ను యథావిధిగా ఉంచుతామని ఏఈ హామీ ఇచ్చి బిగించడంతో ప్రజలు శాంతించి నిరసన విరమించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఏజెన్సీ రహదారుల పట్ల చిత్తశుద్ధి కరువు



కుడుమూరు నుంచి శతాబి, తంగ్లాం ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న రోడ్డును చూపిస్తున్న నాయకులు

పాచిపెంట: గిరిజన ప్రాంతాల రహదారుల అభివృద్ధి పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువైందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోరాడ ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కల్యాణ్, సుబ్బారావు, సేబిరామయ్యలతో కలిసి స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, మండలంలోని కుడుమూరు నుంచి శతాబి, తంగ్లాం తదితర ప్రాంతాలకు వెళ్లే మార్గాల వద్ద ద్విచక్రవాహనాలు, ఆటోలు, ట్రాక్టర్‌లు తదితర వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయన్నారు. ఈ మార్గాల గుండా ప్రయాణం నరకప్రాయంగా మారిందని, స్థానిక గిరిజనులతో పాటు ఈ ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రహదారి సమస్య తొలగించాలని పలుమార్లు గ్రీవెన్స్‌లలో అర్జీలు ఇచ్చినా సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి గిరిజన ప్రాంతాల్లో రహదారి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

మృతుడి కుటుంబానికి మరామర్శ

సీతానగరం: మండలంలోని పెదభోగిలి పంచాయతీలో దీర్ఘ కాలంగా పనిచేస్తున్న రేషన్ 4వ డిపో డీలరు అంబటి సుధాకర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మంచి మిత్రుడిని కోల్పోయామని మండల డీలర్ల యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.సుధాకర్, రామినాయుడు అన్నారు. గురువారం సాయంత్రం జాతీయరహదారిలో సీతానగరం ఆర్వోబీపై జరిగిన రోడ్డు ప్రమాదంలో సుధాకర్ చనిపోగా, అయన భార్య, మాజీ ఎంపీటీసీ అంబటి కల్యాణి గాయాల పాలైన విషయం విదితమే. సుధాకర్ మృతి చెందిన సమాచారం తెలుసుకున్న మండలంలోని డీలర్లంతా సంతాపం వ్యక్తం చేసి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అనంతరం మృతుడి భార్య పెభోబోగిలి మాజీ ఎంపీటీసీ అంబటి కల్యాణిని పరామర్శించారు. అలాగే సబ్బాన శ్రీనివాసరావు, అంబటి సుధాకర్ కుటుంబాన్ని పలుగ్రామాల సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పరామర్శించారు.ఈ నేపథ్యంలో డీలర్ల యూనియన్ సేకరించిన ఫండ్ నుంచి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేయాలని నిర్ధారించి ముందుఅంత్యక్రియల నిమిత్తం రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు లక్ష్మణ రావు, అచ్యుత రావు,సీహెచ్ బలరాంనాయుడు, ఎం. సుధాకర్, లక్షునాయుడు, సింహాచలం, రాజాప్రియాంక, తవిటినాయుడు,బి నరశింహులు,సింహాచలం, పైడిపినాయుడు తదితరులు పాల్గొన్నారు.